క్లుప్తంగా

భగ్గుమన్న భానుడు



నిర్మానుష్యంగా ఉన్న మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: గత రెండు రోజులుగా ఎండ వేడిమి పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10గంటలకు సూరీడు భగ్గుమనడంతో బయటకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. శనివారం ఎండతీవ్రత అధికంగా ఉండడంతో మునగపాక మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

గూడుపమ్మతల్లిని దర్శించుకున్న చెంగల



మాజీ ఎమ్మెల్యే చెంగలకు గూడుపమ్మతల్లి చిత్రపటానికి అందజేస్తున్న నాయకులు

నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామ దేవత గూడుపమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చెంగల వెంకటరావు శనివారం దర్శించుకుని, పూజలు చేశారు. చెంగలను రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వెల్లంకి కాసుబాబు, ఉప సర్పంచ్ చెవ్వాకుల శ్రీను, స్థానిక నాయకుడు నారాయణ మూర్తి తదితరులు దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

20 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

మునగపాక: అన్నదాత సుఖీభవ పథకానికి ప్రతి రైతు ఈ నెల 20లోగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డును కేంద్రానికి తీసుకురావాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈకేవైసీ చేస్తారని తెలిపారు. సన్న,చిన్నకారు రైతులకు కూడా ఈ పథకం అమలు జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు గంగమ్మతల్లి జాతర



గంగమ్మతల్లి ఆలయం

కోటవురట్ల: సుంకపూరులో ఆదివారం గంగమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని పూలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. సుంకపూరు జంక్షన్ వద్ద స్వాగత ద్వారాన్ని రంగులతో తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గంగమ్మ తల్లి ఆలయంలో పావుకోళ్లను మొక్కడం తర తరాలుగా ఆచారంగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత పావుకోళ్లను మొక్కుతారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



దేశభక్తి గురించి వివరిస్తున్న చిల్డ్రన్స్ క్లబ్ సభ్యురాలు సుజాత

మునగపాక: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ సభ్యురాలు సుజాత తెలిపారు. మండలంలోని గవర్ల అనకాపల్లిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వేసవి సెలవుల్లో కాలాన్ని వృథా చేయకుండా ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా కన్వీనర్ ఉమామహేశ్వరరావు, సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు,రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం: మండలంలోని గెడ్డపాలెంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వేకువజామునుంచి స్వామి వారికి ప్రత్యేకపూజలు జరుపుతామని, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామని చెప్పారు.

రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. వారం రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు జనాలకు చుక్కలు చూపిస్తున్నాయి. వేసవి తాపం నుంచి చల్లబడేందుకు పలువురు పండ్ల రసాలు, శీతల పానీయాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయిస్తుండడంతో 'చల్లని' వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. జాతీయ దారి వెంబడి పలు ప్రాంతాల్లో పండ్ల దుకాణాలు వెలిశాయి.



టోల్‌గేట్ వద్ద విక్రయిస్తున్న పుచ్చకాయలు



సైకిల్ పై కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న దృశ్యం

హాట్ సమ్మర్.. కూల్ బిజినెస్..

హైవేపై జోరుగా కొబ్బరి బొండాలు, పుచ్చకాయల వ్యాపారం

పండ్ల రసాలు, శీతల పానీయాలకు గిరాకీ



నక్కపల్లిలో జనరేటర్ సాయంతో పండ్ల రసాల తయారీ

నక్కపల్లి : ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటితే సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు. రానున్న రోజుల్లో ఎండలు ఏ మేరకు మండిపోతాయో తలచుకుంటే గుబులు పుడుతోంది. దాహార్తి తీర్చుకోడానికి ఎక్కువ మంది శీతలపానీయాలతో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలపై ఆధారపడుతున్నారు. దీంతో ముఖ్యంగా జాతీయరహదారిపై కొబ్బరి బొండాలు, పుచ్చకాయల విక్రయాలు జోరందుకున్నాయి.వేంపాడు టోల్‌గేట్ వద్ద వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి కొబ్బరిబొండాలు, పుచ్చకాయలను విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. రోజూ వేలల్లో వ్యాపారం సాగుతోంది.

పుచ్చకాయలు...

వివిధ ప్రాంతాలనుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకొని ఇక్కడ విక్రయిస్తున్నారు. నక్కపల్లి టోల్‌గేట్ ప్రాంతంలో నిత్యం భారీగా అమ్మకాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో ట్రాన్స్‌కో కార్యాలయం, పంచాయతీ కార్యాలయాలు, జాతీయరహదారిపై తాండవ జంక్షన్ పరిసరాల్లో కూడా పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. గతంలో పరిమాణం బట్టి రూ.30 నుంచి రూ.50ల వరకు పుచ్చకాయలను విక్రయించేవారు. పుచ్చకాయలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వీటిని కూడా కిలోల లెక్కన విక్రయించడం మొదలు పెట్టారు. కిలో రూ.30లకు విక్రయిస్తున్నారు. ఒక్కో పుచ్చకాయ రూ.70నుంచి రూ.100 వరకూ పలుకుతోంది. పుచ్చకాయలను ముక్కలుగా కూడా అమ్ముతున్నారు.వాహనాలపై రాకపోకలు సాగించేవారికి,బస్సుల్లో ప్రయాణించేవారివద్దకు తీసుకెళ్లివిక్రయిస్తున్నారు.వేసవి సమయంలో పుచ్చకాయలు, కొబ్బరి బొండాల నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెపుతుండంతో అమ్మకాలు జోరందుకున్నాయి. పాన్ షాపుల్లో కూడా పుచ్చకాయలను జ్యూస్‌గాచేసి గ్లాసు రూ.20కి విక్రయిస్తున్నారు. పాయకరావుపేట టౌన్, వేంపాడు టోల్ గేట్, అడ్డు రోడ్డులలో షాపుల్లో రోజుకు కనీసం వేయి కిలోల వరకు పుచ్చకాయలను విక్రయిస్తున్నారు.

కొబ్బరి బొండాలు...

కొబ్బరి బొండాలకు ఎప్పుడూ గిరాకీ ఎక్కువే. వేసవి కాలమైతే మరీ డిమాండ్ ఉంటుంది. ఒక్కో బొండాం రూ.30లకు విక్రయిస్తున్నారు. సైకిళ్లు,తోపుడుబళ్లపై పెట్టుకొని అమ్ముతున్నారు. జాతీయ రహదారిపై నక్కపల్లి, వేంపాడు, చినదొడ్డిగల్లు, అడ్డురోడ్డు జంక్షన్, పాయకరావుపేట వద్ద రోజుకు కనీసం ఐదు వందల బొండాల వరకూ అమ్మకాలు సాగుతున్నాయని వ్యాపారులు తెలిపారు.

పళ్లరసాలు...

ఆరటి,ద్రాక్ష,బొప్పాయి,కర్బుజా,బత్తాయి,సపోటా తదితర పళ్లరసాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పాన్‌షాపుల్లో వివిధ రకాల జ్యూస్‌లను గ్లాసు రూ.30లకు విక్రయిస్తున్నారు. పట్టణప్రాంతాల్లో అయితే వీటి ధరమరింత ప్రియం. వీటి డిమాండ్‌కు తగ్గట్టుగానే వ్యాపారులు కూడా సరుకులను ముందుగానే హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి ఉంచుకున్నారు. విద్యుత్ కోతల కారణంగా జనరేటర్లుకూడా వినియోగిస్తున్నారు.

చెరకు రసానికీ డిమాండ్..

ఈప్రాంతంలో చెరకు సాగు లేనప్పటికీ చెరకు రసాలను విక్రయించే దుకాణాలు కూడా ఎక్కడికక్కడ వెలిశాయి. వేరే ప్రాంతాల నుంచి చెరకు గడలను కొనుగోలు చేసి తెచ్చి చెరకు రసాన్ని విక్రయిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో వైజంక్షన్, సూర్యామహాల్ జంక్షన్‌లలో పట్టణ వాసుల కోసం చెరకు రసం దుకాణాలు ఏర్పాటు చేశారు. గ్లాసు చెరకు రసం రూ.20లకు విక్రయిస్తున్నారు. మంచిపోషకవిలువలు అందించే చెరకు రసం తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు కూడా చెబుతున్నారు.

పండ్ల రసాల సేల్స్ ఎక్కువ



వేసవి కారణంగా ఎక్కువ మంది పండ్ల రసాలను తాగుతున్నారు. చిన్నపిల్లలతో రాకపోకలు సాగించేవారు, వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు వచ్చే వారు ఎక్కువగా వీటిని తాగుతున్నారు. దూరప్రాంతాల వారు రాకపోకలు సాగించే సమయంలో వడ దెబ్బబారిన పడకుండా కొద్దిసేపు సేదతీరేందుకు మా షాపు వద్ద ఏర్పాట్లు కూడా చేశాం.

– ఎల్లేటి సత్తిబాబు, పాన్‌షాపు, యజమాని,నక్కపల్లి

వెంకన్న ఆలయానికి విరాళం



వెంకన్న ఆలయానికి విరాళం అందజేస్తున్న అప్పారావు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆలయకమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. రూ.5కోట్ల వ్యయంతో మునగపాక బైపాస్‌రోడ్డులో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళాలు అందించి సహకరించాలన్నారు. శనివారం మునగపాకకు చెందిన పెంటకోట అప్పారావు విరాళంగా రూ.10,116 నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు,సూరిశెట్టి రాము,డాక్టర్ బద్దెం సూర్యనారాయణ,దాడి సూరిబాబు,మళ్ల సంజీవరావు,ఆడారి లక్ష్మణరావు,ఆడారి కాశీబాబు,ఆడారి సూర్యచంద్రరావు, బొడ్డేడ రామునాయుడు,పెంటకోట ఆదిశివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ మదర్స్ డే



రాట్నాలపాలెంలో తల్లిని సత్కరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల: బిడ్డలను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో తల్లులదే కీలక పాత్ర అని అంగన్‌వాడీ టీచర్ ఎస్తేరురాణి అన్నారు. రాట్నాలపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ మదర్స్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల పట్ల తల్లుల బాధ్యత, సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ ఎస్తేరురాణి మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ మంచి అలవాట్లు చేయాలన్నారు. అనంతరం పలువురు తల్లులను ఘనంగా సత్కరించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. నరేంద్రపురం, ఉప్పవరం గ్రామాల్లో రొంగలి రాముతో పాటు కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామ సదా శివరావు ఉపాధి పని ప్రదేశాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఉపాధి వేతనదారునికి 200 రోజుల పని కల్పించి, రూ. 600 చొప్పున రోజు కూలి చెల్లించాలని, సమ్మర్ అలవెన్స్, మేట్లకు రూ.5 వేల పారితోషికం ఇవ్వాలని, తాగునీరు, టెంట్లు, నాణ్యమైన పనిముట్లు కల్పించాలని, క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు.

పూడిమడక తీరంలో మెరైన్ సిబ్బంది పల్లె నిద్ర



మత్స్యకారులతో మాట్లాడుతున్న సీఐ సింహాద్రినాయుడు

అచ్యుతాపురం రూరల్ : పూడిమడక తీరంలో మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సచివాలయంలో ఆయన మత్స్యకారులతో మాట్లాడారు. భారత్, పాక్ మధ్య జరుగుతున్న యుద్ధం గురించి వారికి వివరించారు. సముద్ర మార్గం ద్వారా బోట్లపై ఎవరైనా అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు వస్తే వెంటనే మెరైన్ పోలీస్ సిబ్బందికి లేదా 1093 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సిబ్బంది కన్నం నాయుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు 271 తులాల వెండి కవచం

వచ్చే నెల 3న అమ్మవారి పండగకు ఏర్పాట్లు



మోదకొండమ్మకు అలంకరించిన వెండి బంగారు ఆభరణాలు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగలో భాగంగా 271 తులాల వెండితో వెండి కవచం, 8 తులాలతో బంగారంతో శతమానాలతో పాటు వేలాది రూపాయలు విలువ గల పట్టుచీరతో అమ్మవారిని అలంకరించారు. దీంతో పెద్ద ఎత్తున్న భక్తులు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 3వ తేదీన జరగనున్న పండగకు ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పండగకు వచ్చే భక్తులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆదరించడంతో పాటు పండగ విజయవంతం చేయడానికి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కోరారు.

ఎస్సీ సంక్షేమ పథకాలు తక్షణం పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి తక్షణం అమలు చేయాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద శనివారం మండల సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు దళిత కాలనీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు వెచ్చించాలన్నారు. దేవరాపల్లిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సంఘం సభ్యులు సబ్బవరపు దేముడు, తాడి అప్పారావు, తెరపల్లి శ్రీరామ్, తాడి ఎర్నిబాబు, సబ్బవరపు కొండలరావు, మల్లవరపు దేముడు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక వికాసం



క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

అనకాపల్లి: వేసవిలో ఆటలకు ప్రాధాన్యమివ్వాలని, తద్వారా విద్యార్థులకు మనోవికాసం లభిస్తుందని వ్యాపారులు కాండ్రేగుల శ్రీరామ్, బుద్ధ రాజేష్ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ వ్యాయామశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ఆటలకు, వ్యాయామానికి కనీసం ఒక గంట సమయాన్ని కేటాయించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని విద్యనభ్యసించడమే కాకుండా ఆటలు, వ్యాయామం చేస్తే శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు బుద్ధ జగన్, కాండ్రేగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశుని కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం : వేంకటేశ్వస్వామి కల్యాణం వైభవంగా సాగింది. మండలంలోని తామరంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి 23 ఏళ్ల పూర్తి కావడంతో శనివారం ఈ ఆలయంలో వార్షిక కల్యాణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు నగర సంకీర్తనగా వచ్చి అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ వరి కోతలు



గాదిరాయిలో ఖరీఫ్ వరినారుమడికి సిద్ధం చేసిన వరిపొలం

మాడుగుల రూరల్ : మండలంలోని పలు ప్రాంతాల్లో రబీ వరి కోతలు కోస్తున్నారు. మండలంలో పెద్దేరు జలాశయం దిగువ ఆయకట్టు పరిధిలో గల రాచకట్టు కింద ఉన్న వివిధ గ్రామాల్లో రబీలో వరి పంట వేశారు. నాలుగు రోజులుగా ఎండలు కాస్తున్నా లెక్కచేయకుండా వరి కోతలు కోసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. సత్యవరం, కింతలి, ఒమ్మలి, జంపెన, తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో వరి పంటను వేశారు. అలాగే ఖరీఫ్ వరి కోసం నారు మడులను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. వరి నారుమడులు కోసం దుక్కులు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో వరినారు వేయనున్నారు. దీని కోసం వ్యవసాయ శాఖ వారు ఇప్పటికే అన్ని విధాలుగా ఖరీఫ్ వరి విత్తనాలు నమోదుకు త్వరలో ప్రభుత్వం ప్రకటన జారీ చేయనున్నట్టు చెబుతున్నారు.

పెంచిన పాల ధర తగ్గించాలి

◆ వామపక్ష నాయకుల డిమాండ్

అనకాపల్లి: విశాఖ డైయిరీ యాజమాన్యం పెంచిన పాల ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీకి పాలు పోస్తున్న ఆవు పాల ధరను గతంలో తగ్గించిన యాజమాన్యం, వినియోగదారునికి విక్రయించే లీటరు పాలపై రూ. 2 పెంచడం దుర్మార్గమన్నారు. ఏడాది క్రితం లీటరు పాల ధర పెంపును వ్యతిరేకించిన టీడీపీ, జనసేన, బీజేపీ తక్షణమే జోక్యం చేసుకుని తగ్గింపు చర్యలు చేపట్టాలన్నారు. లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు అమ్ముతున్న ధరకు వ్యత్యాసం రూ.20 ఉందన్నారు. నిత్యావసర సరుకుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని పెంచిన పాల ధర తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో....

విశాఖ డైయిరీ పాల ప్యాకెట్ల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న విశాఖ డెయిరీ పాల ప్యాకెట్ల ధరలను పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. రైతుల నుంచి సేకరించిన పాల ధరను పెంచకుండా డెయిరీ యాజమాన్యం వినియోగదారులకు అమ్ముతున్న ధరల పెంచడంలో ఉద్దేశమేమిటమని ప్రశ్నించారు. డెయిరీలో పనిచేస్తున్న కార్మికులు పాడి రైతులు శ్రమను దోపిడీ చేసి పాలకులకు ముడుపుల రూపంలో కట్టబెట్టి తన సంస్థలో ఉన్నటువంటి అక్రమాలను కాపాడుకుంటున్నారని దుయ్యబట్టారు. విశాఖ డెయిరీలో అక్రమాలపైన శాసనసభ కమిటీ వేసి విచారణ చేసినా నేటికీ నిజాలను బహిర్గతం చేయడంలో కూటమి ప్రభుత్వం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తమ అక్రమాలను కాపాడుకోవడం కోసం ఊసరవెల్లి కంటే లక్ష రెట్లు రంగులు మార్చడంలో డెయిరీ యాజమాన్యం గిన్నిస్ బుక్‌లో తమ స్థానాన్ని కలకాలం కాపాడుకుంటుందని ఎద్దేవా చేశారు.

అధిక లోడ్ లారీకి జరిమానా



కశింకోటలో పోలీసులు పట్టుకున్న అధిక లోడ్ లారీ

కశింకోట: స్థానిక జాతీయ రహదారిపై వాణిజ్య పరంగా అధిక రాయి లోడ్‌తో తరలి వెళుతున్న భారీ టిప్పర్ లారీని పట్టుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. జాతీయ రహదారిపై తమ సిబ్బందితో వాహన తనిఖీలో భాగంగా యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు రాయి లోడ్‌తో వెళుతుండగా గుర్తించి పట్టుకున్నామన్నారు. దాన్ని స్వాధీనం చేసుకొని ఆర్టీవోకు అప్పగించగా, రూ.36 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అధిక లోడ్‌తో వాహనాలు ప్రయాణించడం వాహన నియమావళిని ఉల్లంఘించడమేనని, ఇది ప్రమాదాలకు కారణం కావడంతోపాటు రహదారి దెబ్బతినడానికి దోహదపడుతుందన్నారు. దీనిదృష్ట్యా ఇటువంటి వాహనాలకు ఇప్పటికే జరిమానా విధించడం, పలువురు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు. వాహనాల్లో అనుమతించిన బరువుకు మించి లోడును వేసి ఎట్టి పరిస్థితుల్లోను తరలించవద్దన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు, ప్రజలు, ట్రాన్స్‌పోర్టు సంస్థలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నిబంధనలకు అనుగుణంగా పరిమితంగా లోడ్ తరలించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవం



ఎ.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు : ఎ.కోడూరు గ్రామంలో గల మోదకొండమ్మ అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శనివారం ఘనంగా జరిపారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం పర్వదినం కావడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పూజా కార్యక్రమాల్లో భాగంగా అష్టోత్తర కలశాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి వితరణ



ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న కొత్తకోట గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు

రావికమతం: మండలంలో కన్నంపేట గ్రామానికి చెందిన విద్యార్థి సియాద్రి మణికంఠ ఇటీవల అనారోగ్య సమస్యతో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై శనివారం 'సాక్షి'లో వచ్చిన వార్తకు స్పందించిన కొత్తకోటకు చెందిన గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ విద్యార్థిని పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సహాయం శనివారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థికి నగదుతో పాటు అవసరమైన రక్తం సిద్ధం చేశామని సంఘ సభ్యులు శేషు తదితరులు తెలిపారు.